జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 27-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 176 పేజీలు: 8 వెల: రూ.7


# సంకల్పంతోనే.. సన్మార్గం



* తాత్కాలిక సరదాలకు వాడే డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం * మత్తు పదార్థాలు వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలి * గంజాయి నియంత్రణకే సంకల్పం కార్యక్రమం * జిల్లాలోని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు * డ్రగ్స్ సమాచారం అందించేందుకు డ్రాప్ బాక్సులు * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం క్రైం, నవంబర్26 (వార్త):** విద్యార్థులు చదువుకున్న వయసులో చెడు వ్యసనాలకు, చెడు అలవాటులకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచేందుకు పోలీసు శాఖ సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. సంకల్పం పేరిట మంగళవారం స్థానిక రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే సంకల్పం పేరిట మొదటి ప్రాధాన్యతగా గంజాయి నిర్మూలన, మహిళలు చిన్నపిల్లలపై దాడులు నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గంజాయి వాడకం ఎక్కువగా ఉందని తెలిపారు. సరదాకు వాడే మత్తు పదార్థాలు వల్ల క్రమేపి మానసిక పరిపక్వత్వాన్ని కోల్పోయి నేర ప్రవృత్తి వైపు దారిమల్లే అవకాశం ఉందని, తద్వారా ఉజ్వలమైన భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. గంజాయి కేసుల్లో నిందితులుగా పట్టుబడితే చట్టాలు చాలా కఠినంగా శిక్షలు వేస్తాయని తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, ఒకవేళ అలవాటు పడిన వారెవరైనా ఉంటే డీ అడిక్షన్ సెంటరులో ప్రాథమిక స్థాయిలో చికిత్స పొందితే, వాటి నుండి బయటపడవచ్చన్నారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారిన యువత వారి అలవాట్లకు సరిపడే డబ్బులు లేక చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడి నేరస్థులుగా మారుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు అరెస్టులు కంటే అవగాహన కల్పించడంతోనే నిర్మూలించ వచ్చునని భావించి యువతలో చైతన్యం తీసుకొని వచ్చి, వారిని మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా ఉండేందుకు, వాటి అలవాటు నుండి బయటపడేందుకు 'సంకల్పం' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థులు ఒకసారి డ్రగ్స్ ను వినియోగిస్తే ఏమీ కాదన్న భ్రమలో ఉంటారని,కాని డ్రగ్స్ ఒకసారి డ్రగ్స్ తో పాటు ఇతర సమాచారాన్ని కూడా తెలిపేందుకు రద్దీ ప్రదేశాలు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, కళాశాలల్లో పోలీస్ డ్రాప్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట చలం మాట్లాడుతూ 18 నుంచి 25 సంవత్సరాల యువతకు ఆలోచన పరిజ్ఞానం చాలా తక్కువగా ఉంటుందన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్, మత్తు పదార్థాలు వినియోగం వలన కలిగే అనర్థాలపై వైద్య విద్యార్థులు రూపొందించిన గోడ పత్రికను వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, టూ టౌన్ సీఐ ఈశ్వరరావు, ఎస్బీ సీఐ ఇమాన్యూవల్ రాజు, రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ప్రకాష్, పద్మా, ప్రొఫెసర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



## బుడంబోలో పెద్దపులి

**మందస, నవంబర్26(వార్త):** మందస మండలంలోని సాబకోట పంచాయతీలోని బుడంబో, బొందికరి తో పాటు భావనాపురం తదితర గిరి జన గ్రామాల్లో మంగళవారం పెద్ద పులి కనిపించిందని గిరిజనులు చెబు తున్నారు. బుడంబో నుంచి మందస వస్తున్న దారిలో పులి కనిపించిందని, దీంతో తామంతా ఆగిపోవడంతో తాపీ గా నడుచుకుంటూ అడవుల్లోకి వెళ్లి పోయిందని పేర్కొంటున్నారు. అదే విధంగా భావనపురం ప్రాంతంలో కూడా పులిని చూసినట్టు గిరిజనులు చెబుతున్నారు. అడవుల్లో నుంచి వచ్చిన పులి గ్రామం సమీపంలో ఉన్న కొండ వైపు వెళ్లిందన్నారు. అలాగే బుడంబో నుంచి వస్తున్న ఉద్యోగులకు కూడా పెద్ద పులి కనిపించదని ప్రచా రం జరుగుతోంది. గతంలో జిల్లాలో పెద్ద పులి సంచారంపై వార్తలొచ్చి నప్పుడు మందస ప్రాంతం లో కూడా పెద్ద పులి అడుగుజాడలను అటవీ శాఖాధికారులు గుర్తించారు. మళ్లీ అదే గిరిజన గ్రామాల్లో పెద్ద పులి కనిపిం చిందని చెబుతుండడంతో స్థాని కులు భయాందోళనలు చెందుతున్నారు. వరి పంట పండి కోతకు వచ్చింది. ఈ తరుణంలో వరి పంటను తినడానికి అడవి పందులు ఈ ప్రాంతంలో ఎక్కు వగా వస్తుంటాయి. అడవి జంతువుల నుంచి రక్షణకు రైతులు రాత్రుల సమ యంలో కాపాలాకు వెళ్తుంటారు. పెద్ద పులి సంచారం ప్రచారంతో రైతులు పొలాల్లోకి కాపలాకు వెళ్లడానికి వెను కడుగు వేస్తున్నారు. నిత్యం అటవీ ప్రాంతంలో తిరిగే గిరిజనులు కూడా పెద్దపులి సంచారంతో భయపడు తున్నారు.

# సిక్కోలుకు అల్పపీడనం.. ముప్పు



**శ్రీకాకుళం, నవంబర్ 26(వార్త):** అల్పపీడనం కారణంగా శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 29 నుంచి వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా చూడాలని, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి పోకుండా చూడాలని, రైతులకు టార్పాలిన్‌లు, టెంట్‌లు, గోనె సంచులు, ఇతర అవసరమైన వసతులను అందించాలని సూచించారు. ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ ఉంచి, టార్పాలిన్‌లు కప్పి, నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెళియాపుట్టి మండలంలో 1000 ఎకరాలకు తక్కువ కాకుండా భూమిని సేకరించి లాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. కేంద్ర నిధులతో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉండాలని, అందుకోసం ఎకరా చొప్పున భూమిని సేకరించాలని చెప్పారు. ఆయా చోట్ల ఇండోర్, అవుట్ డోర్ కోర్టులను నిర్మిస్తామన్నారు. పల్లె పండుగలో శంకుస్థాపనలు చేసిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బూర్జ, పొందూరు, సంతబొమ్మాళి మండలాలు ప్రగతిని సాధించడంలో వెనకబడి ఉన్నాయన్నారు. వివిధ శాఖలకి నిర్దేశించిన వంద రోజుల ప్రగతి తదితర అంశాలపై సమీక్ష చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, సిపిఓ ప్రసన్నలక్ష్మి, డిఆర్డిఏ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి, డ్వామా పీడీ బి.సుధాకర్ బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు.

### వరికోతలు వాయిదా వేసుకోండి

అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాధ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వరి కోతలు చేయని వారు వాయిదా వేసుకోవాలని, కోతలు జరిగి, పొలంలో వరి పనలు వున్నట్లైతే వెంటనే కుప్పలు పెట్టుకొని టార్పానులతో కప్పి జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. అలాగే నూర్పు జరిపిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలలో భద్రపరచుకోవాలని, కళ్లంలో ధాన్యం ఉన్నట్లయితే వెంటనే బస్తాలలో నింపుకొని ఇంటి వద్దగానీ లేదా దగ్గర్లోనే మిల్లు వద్ద గాని భద్రపరచుకోవాలన్నారు. షెడ్యూలింగ్ లేకపోయినా ధాన్యాన్ని ఆయా మిల్లులకు తరలించుకోవచ్చని స్పష్టం చేశారు.

* 29 నుంచి వర్షం కురిసే అవకాశం
* ధాన్యం తడవకుండా చూడాలి
* వెయ్యి ఎకరాల ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేయండి
* నియోజకవర్గ కేంద్రాల్లో బ్యాడ్మింటన్ కోర్టులు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



## అంబేద్కర్‌కు నివాళి

**శ్రీకాకుళం, నవంబర్26 (వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నివాళులు అర్పించారు. మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్ర పటానికి కలె క్టర్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర రావు, ఉప కలెక్టర్లు అప్పారావు, పద్మావతి, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బి.కరుణశ్రీ పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డాన్స్ విత్ మీ.. స్కూల్ ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 26 (వార్త):** నగరంలోని చిన్నబజారు రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదురుగా డాన్స్ విత్ మీ పేరిట డాన్స్ స్కూల్ ఆదివారం ప్రారంభమైంది. నగరానికి చెందిన ప్రముఖులు ఈ స్కూల్‌ను ప్రారంభించి డాన్స్ మాస్టార్ నవీన్‌ను అభినందించారు. సందర్భంగా నవీన్ మాట్లాడుతూ డాన్స్ అంటే తనకు ఎంతో ప్రాణమన్నారు. పట్టుదలతో డాన్స్‌లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నిత్యం డాన్స్ చేయడం వల్ల ఆరోగ్యం కూడా బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో బాబు మూవర్స్ అండ్ ప్యాకర్స్ అధినేత గోవింద్, మజ్జి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



# కిడ్నీ పరిశోధన కేంద్రానికి సుస్తీ..!

* వైయస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వైద్యుల కొరత * అంతంత మాత్రంగానే అందుతున్న వైద్య సేవలు * లక్ష్యానికి దూరంగా 74 కోట్ల పరిశోధన కేంద్రం * ప్రహరీ లేకపోవడంతో పలు సమస్యలు * కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ నర్తు రామారావు * అందుతున్న సేవలు పైన అసంతృప్తి * వారం తర్వాత మరోసారి కలుస్తానన్న ఎమ్మెల్సీ * కిడ్నీ పరిశోధన కేంద్ర సమస్యలు కలెక్టర్ దృష్టికి * పత్రికలకు ప్రకటన విడుదల చేసిన నర్తు రామారావు



**పలాస/ కవిటి, నవంబర్ 26(వార్త):** ఉద్దాన ప్రాంతంలోని కిడ్నీ రోగులకు విశేష సేవలు అందించడంతో పాటు, కిడ్నీ వ్యాధి మూలాలను కనుగొనేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రీసెర్చ్ కేంద్రాన్ని కాశిబుగ్గ సమీపంలో ఏర్పాటు చేసింది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం దాదాపు 74 కోట్ల రూపాయలు వెచ్చించి వైయస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తో పాటు కిడ్నీ రీసెర్చ్ కేంద్రాన్ని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిందటి సంవత్సరం డిసెంబర్లో ప్రారంభించారు. అయితే, ప్రభుత్వం మారడంతో ఆ ఆసుపత్రి నిర్వహణ ఎలా ఉందనే ఆలోచనతో శ్రీకాకుళం నియోజకవర్గ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు మంగళవారం ఆసుపత్రిని సందర్శించారు. సూపరింటెండెంట్ పద్మజా తో కలిసి వివిధ విభాగాలను పరిశీలించారు. ఒక రోజుకు ఎంతమంది రోగులు ఆసుపత్రికి వచ్చి సేవలను వినియోగించుకుంటున్నారని, వైద్య సిబ్బంది ఇబ్బందులను, డయాలసిస్ పొందుతున్న రోగుల వివరాలను, శోధన కేంద్రం ద్వారా జరుగుతున్న పరిశోధనల వివరాలను, కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహకాలను, ఆసుపత్రి అభివృద్ధికి తీసుకుంటున్నటువంటి చర్యలను సూపరింటెండెంట్ పద్మజ నీ అడిగి తెలుసుకున్నారు. ఆమె తెలిపిన వివరాలు కొన్నిటిపట్ల సుముకత వ్యక్తం చేశారు.





ఆసుపత్రి అభివృద్ధికి, కిడ్నీ రోగులకు మేలు చేసే దానికి తగిన ప్రతిపాదనలు అందివ్వాలని శాసన మండల సభ్యులు రామారావు ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. మరో వారం రోజుల అనంతరం మరొకసారి ఈ కేంద్రాన్ని సందర్శిస్తానని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి మీరిచ్చిన సూచనలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. వార్డులలో ఉన్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రహరీ నిర్మాణానికి కలెక్టర్కు నివేదిక అందిస్తానని చెప్పారు. 72 మంది వైద్యులు ఉండాల్సిన చోట 23 మాత్రమే ఉండటం పట్ల కొంత అసంతృప్తిని వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో వైద్యుల నియామకాన్ని చేపట్టి తద్వారా పరిశోధన కేంద్రం ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

### ఇచ్చిన మాట ప్రకారం కట్టిన ఆసుపత్రి

ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు తీవ్రతను తెలుసుకొనేందుకు ఇచ్చాపురం నియోజకవర్గం లోని జగతి పంచాయతీకి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డిని తాను తీసుకొచ్చినట్టు ఈ సందర్భంగా రామారావు తెలిపారు. ఆరోజు జగనన్న తన ప్రభుత్వం ఏర్పాటు జరిగితే, కిడ్నీ రోగులకు పదివేల రూపాయల పెన్షన్ తో పాటు.. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం 200 బెడ్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 74 కోట్ల రూపాయలను వెచ్చించి, కిడ్నీ రోగుల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారని రామారావు వివరించారు. ఒక్కసారి జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు అవకాశం కల్పిస్తే ఇటువంటి ఎన్నో మంచి పనులను చేశారని ఆయన గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇలా చెప్పుకునేందుకు ఒక్క పని అయినా పూర్తి చేశారా అంటూ ప్రశ్నించారు. ఎంతో మంచి ఆలోచనతో నిర్మించిన ఈ వైయస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి పూర్తిస్థాయిలో వైద్యుల నియామకాన్ని చేపట్టి, కిడ్నీ వ్యాధికి సంబంధించి పరిశోధనలను పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని ఆయన కోరారు. మరో వారం రోజుల్లోపు ఆసుపత్రి తీరుతెన్నులపై కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని స్పష్టం చేశారు. ఈ ఆసుపత్రి సందర్శనకు రామారావుతోపాటు కంచిలి మాజీ ఎంపీపీ, తాజా జడ్పీటీసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మండల జగన్ ఉన్నారు.




## 31వ డివిజన్‌లో సైబర్ మోసాలపై అవగాహన

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 26(వార్త):** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్ పరిధిలోని దండివీధిలో టీడీపీ ఇన్‌చార్జీ విభూది సూరిబాబు ఆద్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీఐ పైడపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు వివరించారు. సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని, ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 112కు ఫోన్ చేయాలని వారు సూచించారు. విభూది సూరిబాబు మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు జామి సాక్షిత్

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 26(వార్త):** హర్యానా రాష్ట్రంలోని పంచ్ కులా వేదికగా ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ జరుగనున్న 38వ జాతీయ సబ్ జూనియర్ కూర్గీ,13వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు శ్రీకాకుళం నగరానికి చెందిన జామి సాక్షిత్ ఎంపిక కావడం పట్ల జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో సాక్షిత్ సత్తా చాటి గోల్డ్ మెడల్ ను సాధించాడు. అండర్ 50 కె.జిల వెయిట్ లో కూర్గీ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకి ఎంపికయ్యాడు. ఈ పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరే ముందు శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిశారు. జాతీయ స్థాయి పోటీలో కూడా రాణించి జిల్లాకి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని ఆకాంక్షించారు. చిన్న తనంలోనే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే స్థాయికి సాక్షిత్ ఎదగడం పట్ల అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకి ఎంపికైన సాక్షిత్‌ను ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు నౌపడ విజయ్ కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మ, బలభద్రుని రాజా, డా.కంఠ వేణు,గురుగుబెల్లి ప్రసాద్, బెవర జ్యోతి ప్రసాద్, వాండ్రింగి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

## బాల్యవివాహాలు అరికట్టాలని నేడు కొవ్వొత్తుల ర్యాలీ

**శ్రీకాకుళం, నవంబర్ 27(వార్త):** రోజురోజుకూ పెరుగుతున్న బాల్యవివాహాల నిరోధానికి కేంద్ర ప్రబుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా ర్యాలీలు మానవహారాలు ప్రదర్శనలు చేపడుతోంది. బాల వివాహ ముక్త్ భారత్ పేరుతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని బ్రెడ్స్ సంస్థ ప్రతినిధి ఎం. సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా శ్రీకాకుళం నగరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ అవగాహన కొవ్వొత్తుల ర్యాలీ సాగుతుంది. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీలు ప్రారంభిస్తారని తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి..

# సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయండి

* అర్హత ఉన్న ప్రతి పేదవారికీ ఎన్టీఆర్ ఇల్లు మంజూరు * టెక్కలిలో ఆదర్శ కాలనీ నిర్మిస్తాం * రహదారుల పనుల్లో నాణ్యత పరిశీలించండి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష

**టెక్కలి, నవంబర్ 26 (వార్త):** టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి తనకు అందజేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో రహదారులు, హౌసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఇప్పటిదాకా సొంత ఇల్లు లేని వారంతా నూతన ఇళ్లు కోసం అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి తక్షణం మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. 2014- 2019 సంత్సకాలంలో మంజూరై ఆన్ లైన్‌లో అర్హుల జాబితా లేని వాటిపై కూడా గుర్తించి వాటిని కూడా పరిష్కరించాలని హౌసింగ్ అధికారులు సూచించారు. టెక్కలిలో ఆదర్శ కాలనీ నిర్మాణానికి సంకల్పించామని, అన్ని వసతులతో ఉండే విధంగా చేపడతామని అన్నారు. గ్రామాల్లో బీటీ, సీసీరహదారులు, మురుగు కాలువలు నిర్మాణంతో పాటు, స్వచ్చమైన తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రతిపాధనలు తయారు చేయాలని సూచించారు. ఇప్పటికే పల్లెపండగ పేరుతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి రైతుకి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఎత్తిపోతల పథకాలు ద్వారా రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ప్రస్తుతం నియోజవర్గంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని రహదారుల శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం 52 పనులు గాను రూ 5 కోట్లతో పనులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. సమావేశంలో ఆయా శాఖల డీఈలు, ఏఈలు పి.సత్యనారాయణ, రవికాంత్ పాల్గొన్నారు.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వైభవంగా ఆదిత్యుని కల్యాణం



**అరసవల్లి, నవంబర్ 26 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామికి వైభవంగా కళ్యాణం నిర్వహించారు. కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.



## కూటమి ప్రభుత్వంలో
# రెడ్ బుక్ రాజ్యాంగం

### వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

**ఆమదాలవలస, నవంబర్ 26 (వార్త):** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆమదాలవలసలోని జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో స్థానిక నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తో పాటు వైసీపీ సీనియర్ నాయకులు ఖండాపు గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, చింతాడ వెంకటరమణ, దుంపల శ్యామ్, ఇతర వైసీపీ నాయకులు, కార్యకర్తలు డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం చింతాడ రవికుమార్ మీడియాతో మాట్లాడారు. జాతీయ నాయకులు ఎంతో ముందుచూపుతో, ప్రజాస్వామ్య పరిరక్షణ స్ఫూర్తితో భావప్రకటనా హక్కును రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. అటువంటి హక్కును నేడు ఈ కూటమి ప్రభుత్వం కాలరాస్తూ, ప్రశ్నించే గొంతును నులిమేసే విధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీలకి నేషనల్ రిఫరీగా గౌతమ్

**శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబర్ 26(వార్త):** హర్యానా రాష్ట్రంలోని పంచ్ కులా వేదికగా ఈ నెల 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ జరుగనున్న 38వ జాతీయ సబ్ జూనియర్ కూర్గీ, 13వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకి నేషనల్ రిఫరీగా శ్రీకాకుళంకి చెందిన తైక్వాండో కోచ్ మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఆర్.డి.మంగేశ్వర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నగరానికి చెందిన మజ్జి గౌతమ్ గత అనేక సంవత్సరాలుగా తైక్వాండో క్రీడాకారులకి కోచింగ్ ఇస్తున్నారు. ఎంతోమంది తైక్వాండో క్రీడాకారులను తీర్చిదిద్దారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో టెక్నికల్ అఫీషియల్‌గా, రిఫరీగా కూడా పనిచేశారు. సీనియర్ తైక్వాండో క్రీడాకారుడైన గౌతమ్ కోచ్‌గా కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇప్పుడు హర్యానాలోని పంచ్ కులా లోని దేవి లాల్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకి నేషనల్ రిఫరీగా మజ్జి గౌతమ్ వ్యవహరించనున్నారు. నేషనల్ రిఫరీగా నియమితులైన మజ్జి గౌతమ్‌ను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అభినందించారు. భవిష్యత్ లో కూడా మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లాకి చెందిన క్రీడాకారులు రాణించేలా శిక్షణలను అందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గౌతమ్ కి సూచించారు. నేషనల్ రిఫరీగా నియమితులైన గౌతమ్ ను ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను ,శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు నౌపడ విజయ్ కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మ, బలభద్రుని రాజా, డా.కంత వేణు, గురుగుబెల్లి ప్రసాద్, బెవర జ్యోతి ప్రసాద్, వాండ్రంగి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

## ర్యాగింగ్‌కి పాల్పడితే భవిష్యత్ శూన్యం

### జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసి నాయుడు

**శ్రీకాకుళం లీగల్, నవంబర్ 26(వార్త):** ర్యాగింగ్‌కి పాల్పడితే భవిష్యత్తు శూన్యం అని జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వరకట్న నివారణ, యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌పై మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరకట్న విధానం వధువు కుటుంబంపై పెను ఆర్థిక భారాన్ని మోపుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో, వరకట్న వ్యవస్థ మహిళలపై నేరాలకు దారి తీస్తుందని తెలిపారు. వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం కూడా నేరమని దీనికిగాను తగిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.




## గేటు పడితే..
# గంట ఆగాల్సిందే!

*** రత్తకన్న ఎల్‌సి గేటుతో నరకయాతన * నిత్యం అవస్థలు పడుతున్న ప్రజలు * కలగా మిగిలిన అండర్ పాసేజి, ఓవర్ బ్రిడ్జి నిర్మాణం**



**ఇచ్ఛాపురం, నవంబర్ 26 (వార్త):** రత్తకన్న రైల్వే లెవెల్ క్రాస్ గేటుకో ప్రత్యేకత ఉంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో ఇచ్ఛాపురంనకు మొదటి రైల్వే గేటు. అలాగే రైల్వే స్టేషన్ కి సమీపంలో ఉన్న గేట్ కావడంతో రెండు రాష్ట్రాల్లోని సరిహద్దులో ఉన్న సుమారు 40 గ్రామాల ప్రజలతో పాటు మున్సిపాలిటీ ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇక్కడ గేటు పడిందంటే గంట ఆగాల్సిందే అనే నానుడి ఉంది. రైల్వే స్టేషన్ నార్త్ క్యాబిన్‌ని వద్ద కొలిగామ్ రోడ్ లో ఉన్న రైల్వే గేట్ దాటాలంటే ప్రత్యామ్నాయ మార్గం ఏదీ లేదు. గేటు పడితే వేచి చూడాల్సిందే. గతంలో ఎం తోటూరు వద్ద కొండ నీరు వెళ్లేందుకు పాసేజి ఉండేది. అది వేసవికాలంలో కొంతవరకు ద్విచక్ర వాహనాలకు ఉపశమనం కలిగించేది. కాల క్రమంలో రైల్వే హైటెన్షన్ వైర్లు టౌన్ ఫీడర్ ఎలక్ట్రికల్ వైర్లు దీని నుండి వెళ్లడంతో ఈ పాసేజి కాస్త మూసుకునిపోయింది. దీంతో వెళ్లే మార్గం లేకుండా పోయింది. స్టేట్ బ్యాంక్ రోడ్డు వికెపేట నుండి కొలిగాం వరకు 15 కిలోమీటర్ల దూరం బొడ్డబడా వరకు 20 కిలోమీటర్ల దూరం. ఒరిస్సాలోని భీంపురం, కోటిలింగే, చీకటి, పితా తోలి, రొంప, బరోడా దేవుని మద్దిలి వంటి గ్రామాల్లోని ప్రజలు ఈ రోడ్డు నుండే రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే గేట్ వెంటనే పక్కనే ఎంతోటూరు పూర్ణ సినిమా హాలు, రక్తకన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, సత్య సాయి హై స్కూలు, ఆదిత్య





జూనియర్ కళాశాల, సూర్య స్కూలు, కొలిగం, బిర్లంగి మరియు మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారు 15 వరకు ఇటుకలు బట్టీలు ఉన్నాయి. ఇసుక, క్వారీ రాయి, ఇటుకలకు రవాణా చేసేందుకు ఈ రోడ్డు ప్రధాన మార్గం. బొడ్డబడ, కొలిగాం, పాయితారి, కీర్తిపురం, హరిపురం, బొడ్డకాలి, తేలుకుంచి, బిర్లంగి, మశాఖపురం, మున్సిపాలిటీ రత్తకన్న మూడు వార్డులు, ఎం.తోటూరు, భవానిపురం, మండపల్లి, బుద్దపేట, మునిబద్ర, బాలకృష్ణాపురం ప్రధాన గ్రామాలు ఉన్నాయి. స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లేందుకు వందలాదిమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. రోజుకి 30 వరకు ప్రైవేట్ స్కూల్ బస్సులు రాకపోకలు చేస్తుంటాయి. ప్రైవేట్ బస్సులు ,ఆర్టీసీ బస్సులు ఈ రోడ్డు గుండా అనే ప్రయాణం సాగిస్తుంటాయి. స్టేషన్ పక్కనే గేట్ ఉండడంతో ట్రైన్ రావడానికి పది నిమిషాల ముందు గేటు వేస్తారు. ఇంటర్ లాకింగ్ సిస్టం ఉండటం వల్ల ట్రైన్ వెళ్లిన ఐదు నిమిషాల తర్వాత గాని గేట్ తీసే అవకాశం లేదు. మరోవైపు బరంపురం ఇచ్ఛాపురం మధ్యలో గోలంత్ర, సుర్ల రెండు స్టేషన్‌లు ఉన్నాయి. బరంపురం నుండి ఇచ్ఛాపురంనకు 20 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ 15 నిమిషాల జర్నీ కావడంతో గోలంతర దాటిన వెంటనే గేటు వేస్తున్నారు. దీంతో ఒక ట్రైన్ వెళ్లిన వెంటనే తీసిలోపు మెయిల్ లైన్‌లో మరో ట్రైను లేదా లూపు లైన్లో మరో ట్రైన్ వచ్చే అవకాశం ఉండడంతో ఒక్కోసారి 15 నిమిషాల నుండి అరగంట వరకు గేట్ పడటం జరుగుతుంది. దీంతో ప్రజలు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. గేటు నుండి తప్పించుకునేందుకు ఎటువంటి ప్రత్యేక మార్గం కూడా లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గేటు ఎప్పుడు తీస్తారా అని ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. అంబులెన్స్‌లో ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో తరలించాల్సి వస్తే ఇక అంతే సంగతులు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, సమయానికి ఉపాధ్యాయులు హాజరు కావాలి. బయోమెట్రిక్ హాజరు కావడంతో గేటు వల్లే గంటకు పైగా నష్టపోతున్నారు. ఇక విద్యార్థులు కూడా గేటు వల్ల లేటుగా వెళుతున్నారు. గతంలో గేటు వేసే లోపు తీసే లోపు తొందర పడిన సందర్భంలో ప్రమాదాలు కూడా జరిగాయి. ఆటో లు ఢీకొన్న ఘటనలో గేటు విరిగిపడ్డ సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ దుస్థితి పై గతంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు చేసిన ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. గతంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మున్సిపాలిటీ తీర్మానం కూడా చేవారు. 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. అయితే నిర్మాణానికి ఎక్కడ అనువైన స్థలం లేకపోవడంతో బ్రిడ్జి పొడవు రెండు కిలోమీటర్ల మేర పెరిగే అవకాశం ఉండడంతో వ్యయం కోట్లలో దాటడంతో రైల్వే అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కనీసం అండర్ పాసింజర్ నిర్మాణం జరిగితే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు పాదచారులు, అంబులెన్స్ వెళ్లే అవకాశం ఉంటుందని భావించి అటుగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. అది కూడా కార్యరూపం దాల్చ లేదు. అన్ని ప్రయత్నాలు ప్రతిపాదన దశలో అంచనా దశలో ఉండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. అయితే అండర్ పాసేజ్ నిర్మాణం, ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కొన్ని దుష్టశక్తులు అడ్డుపడుతున్నట్లు సమాచారం.

# రాజ్యాంగాన్ని గౌరవించాలి

### ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 26 (వార్త):** భారత రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించటం మన అందరి బాధ్యత అని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఐపీఎస్ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగం 75వ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, పితామహుడు డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశికను పఠిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఎఓ గోపినాథ్, ఆర్ఎస్ఐ లు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడ ఆదిత్యలో రాజ్యాంగ దినోత్సవం

నగరంలోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. భారత ప్రభుత్వం యువ జన వ్యవహారములు క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, సెట్‌శ్రీ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉమామహేశ్వర రావు, ఎ.శ్రీనివాస కుమార్, జిల్లా యువజన అధికారి కె వి ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాద రావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.నాగభూషణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం దేశ ప్రజల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ విధానంను సక్రమంగా నిర్వహించడంలో దీని పాత్ర కీలకమన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## దుకాణాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

**ఆమదాలవలస, నవంబర్ 26(వార్త):** ఆమదాలవలస పట్టణంలో ఇటీవల కాలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం అధికం కావడంతో పోలీసులు మంగళవారం వివిధ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇకపై యువత ఎటువంటి మత్తు పదార్థాలకు బానిసలుగా అవ్వకుండా చర్యలు చేపడతామన్నారు. యువత వారి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. మత్తు పదార్థాలతో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# ఎయిర్‌పోర్ట్‌తో ఉద్దానానికి మేలు





**మందస, నవంబర్ 26(వార్త):** ఎయిర్‌పోర్ట్‌తో మేలు జరుగుతుందని, ప్రజలు అర్థం చేసుకోవాలని టీడీపీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన కోరారు. హరిపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంఘాల పేరుతో కొంత మంది వ్యక్తులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, వారిలో కొంత మంది వైసీపీ నాయకులు కూడా ఉన్నారన్నారు. ఈ అంశం కేవలం పలాస నియోజకవర్గానికి సంబంధించినది కాదని, జిల్లా అభివృద్ధికి బాటలు వేసేదని విజ్ఞులైన ప్రజలు అర్థం చేసుకోవాలని విన్నవించారు. ఎమ్మెల్యే శిరీష, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును నష్టపరిహారం పెద్ద మొత్తంలో అందించాలని, యువతకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేద్దామని సూచించారు. జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు మాట్లాడుతూ ఈ ఎయిర్‌పోర్టుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ నాయకుల భ్రమల్లో ఎవరూ పడద్దని కోరారు. సమావేశంలో మండల జనసేన అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, డుంకురు తిరుపతిరావు, బేతాళపురం ఎంపీటీసీ సభ్యుడు సూరాడ వాసు, దున్న తిరుపతి, చౌదరి మురళీకృష్ణ, బైరిశెట్టి గున్నయ్య, మామిడి తాతారావు, సాలిన జానకిరావు, జుత్తు అప్పలస్వామి, గొర్ల హరీష్, అందాల గిరి, కొర్నాన రుద్రయ్య పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు:** స్థానిక రైతులు, మత్స్యకారులు ఆమోదంతోనే గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు పంచాయతీలో ఒంకులూరు రైతులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరగకుండా పార్టీ అందుబాటులో ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు ప్రచారాలను రైతులు నమ్మవద్దని ఆయన కోరారు. ఒంకులూరు ఎంపీటీసీ సభ్యురాలు కొండ సురేఖ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి పరిస్థితుల్లో అన్యాయం చేయమన్నారు. కార్యక్రమంలో చీకటి ధనుంజయ, లైశెట్టి భీమారావు, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, కోడ రామన్న, సాతుపల్లి కామేశ్వరరావు, మెట్టూరు, గునుపల్లికి చెందిన రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం

**మందస, నవంబర్ 26(వార్త):** దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయమని మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ చైర్మన్ మల్లారెడ్డి భాస్కరరావు అన్నారు. మందసలోని వివేకానంద విద్యానికేతన్ ఆవరణలో మంగళవారం కృత్రిమ అవయవాల పంపిణీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు ఆర్థికసాయం కూడా చేస్తున్నామన్నారు. విజయనగరానికి చెందిన శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 15 మందికి కృత్రిమ కాళ్లు అందివ్వడానికి కొలతలు తీసుకున్నామని, ఐదుగురికి చంక కర్రలు ఉచితంగా అందించామన్నారు. ఒక అంధునికి బ్రెయిలీ లిపితో కూడిన స్లేట్, ముగ్గురికి హియరింగ్ మిషన్ పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో కర్రి దుర్యోధన, డి.రామారావు, హేమలత, జోగారావు, వివేకానంద విద్యానికేతన్ ఏవో బి.కామేశ్వరరావు, హెచ్ఎం పి.కోటేశ్వరరావు, జనశంకర్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.




# యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**మందస, నవంబర్ 26(వార్త):** యూటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా నూతన కమిటీ ఎన్నిక మంగళవారం హరిపురంలో జరిగింది. జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎన్నికల అధికారి ఎస్.మురళీమోహన్, ఎన్నికల పరిశీలకుడు ఎస్.కిశోర్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షునిగా కె.వైకుంఠరావు, అధ్యక్షునిగా లండ బాబూరావు, సహాధ్యక్షులుగా కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బమ్మిడి శ్రీరామమూర్తి, కోశాధికారిగా బి.రవికుమార్, కార్యదర్శులుగా హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాష్, జి.సురేష్, జి.నారాయణరావు, వై.వాసుదేవరావు, టీవీటీ భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, బోడ శ్రీను, ఎంవీ రమణ, గున్న రమేష్, కంచరాన రమేష్, బి.శంకరరావు, జి.మాధవరావు, ఎం.మురళి ప్రకాష్, జి.శారద, ఎస్.స్వర్ణకుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బోనెల గౌరీశ్వరరావు ఎన్నికయ్యారు. సభ్యులుగా పినకాన బాబూరావు, పి.ఉమాభాస్కర్, డి.గణపతిరావు, ఎస్.జయరాం, సుదర్శన బెహరా, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా చౌదరి రవీంద్ర, పి.అప్పారావు, వై.ఉమాశంకర్, ఎస్.నారాయణరావు, బల్ల చిట్టిబాబు, గుంట కోదండరావు, దండు ప్రకాశరావు, ఎం.వాగ్దేవి, ఆర్.దమయంతి, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఎల్.వెంకటాచలం, కోకన్వీనర్‌గా కంచరాన మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# వేమనరెడ్డి సంఘం అధ్యక్షుడిగా మేఘనాథంరెడ్డి

**ఇచ్ఛాపురం, నవంబర్ 26(వార్త):** ఇచ్ఛాపురం వేమన రెడ్డి సంఘం నూత న కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా సిల్లా మేఘనాథం రెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగాల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా దక్కత విశ్వనాథంరెడ్డి, కోశాధికారిగా ఆశి గౌరీశంకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. రెడ్డిక సాధికారిక సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, అడ్వైజర్స్‌గా నిర్మలారెడ్డి, లీలారాణి, రెయ్య జానకీరావు, ఆసి తులసయ్యరెడ్డి, తిప్పన భాస్కర్‌రెడ్డి, సభ్యులుగా బచ్చు శంకర్, ఇసురు భాస్కర్‌రెడ్డి, దక్కత శ్రీరామ్ రెడ్డి, దుర్గాసి సోమేశ్ రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు సంఘ భవనానికి స్థలం మంజూరుచేయాలని విప్ బెందాళం అశోక్‌ని కోరారు.





## రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

**వంగర, నవంబర్ 26(వార్త):** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని సివిల్ సప్లై డీటీ పిన్నింటి రామారావు డీలర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన వంగర తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు, పంచదార వంటి సరుకులకు సకాలంలో డీడీలు తీయాలన్నారు. ప్రజల నుంచి ఏ ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్, డ్రగ్స్‌తో అప్రమత్తం



**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** సైబర్ నేరగాళ్లు, డ్రగ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన జలుమూరు జూనియర్ కళాశాలలో ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలి



**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఉండాలని ఎంఈవో యు.శాంతారావు ఆదేశించారు. మంగళవారం ఆయన వీఎన్ పురం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం రుచికరంగా, వేడిగా విద్యార్థులందరూ తినేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి కృషి

**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** ఉర్లాం పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన ఆ పీహెచ్‌సీలో జరిగిన ఆసుపత్రి సలహా సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రిలో ఓపీని మరింత పెంచాలని, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## టీచింగ్ టూల్స్ పరిశీలన

**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** నరసన్నపేట బోర్డు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సమగ్ర శిక్షా సీఆర్ఎంటీ శ్రీనివాసరావు సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా టీచింగ్ టూల్స్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధన చేసేటప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలన్నారు. ఇవి టీచ్ టూల్ యాప్లో నమోదుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**జలుమూరు, నవంబర్ 26(వార్త):** చల్లవానిపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో డబ్బులు 48 గంటల్లో జమ చేస్తామని తెలిపారు. పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, మండల పార్టీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు,ఏఎంసీ మాజీచైర్మన్ వెలమల చంద్రభూషణ్, సర్పంచ్లు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, మంచిరెడ్డి రామచంద్రరావు, బోడాల బాలకృష్ణ, తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య, పట్ట ఉమామహేశ్వరరావు, గుండ మన్మథరావు కోపరేటివ్ సొసైటీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా భోజనం..?

- -బుడంబో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్పై ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు ఆగ్రహం
- -మెమోలు జారీ చేయాలని డీడీకి ఆదేశం



**మందస, నవంబర్ 26(వార్త):** ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన మందస మండలంలోని బుడంబో ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. మెనూ సక్రమంగా, వండిన భోజనం రుచికరంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్కు మెమోలను జారీ చేయాలని డీడీకి ఆదేశించారు. తరగతి గదులను, భోజనశాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికను వీక్షించారు. అనంతరం కిల్లోయి కాలనీ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. మెనూ అమలు తీరును అభినందించారు. భోజన పదార్థాలు చాలా రుచికరంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇదే తీరును కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో శ్రీధర్రాజా కోరారు. నరసన్నపేటలో ఇటీవల ఏర్పాటు చేసిన సూర్యఘర్ పథకాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి ప్రభుత్వం రాయితీ కూడా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఐదు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



**ఇచ్ఛాపురం, నవంబర్ 26(వార్త):** యూపీకి చెందిన విశాల్యాదవ్ని ఐదు కిలోల గంజాయితో మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. ఒడిశా నుంచి ముంబైనకు గంజాయి తరలిస్తుండగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద ఆయనను టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు అదుపులోకి తీసుకున్నారన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు

**వజ్రపుకొత్తూరు, నవంబర్ 26(వార్త):** బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని పలాస ఐసీడీఎస్ పీవో పార్వతి హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్నాయుడు అధ్యక్షతన కిశోర బాలికల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో పిల్లలకు వివాహాలు చేయడంతో అనారోగ్యానికి గురవుతారని, పిల్లలు అంగవైకల్యం ఇతర సమస్యలతో ఇబ్బంది పడతారన్నారు. గ్రామాల్లో ఈ బాల్య వివాహాలపై ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్స్, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని కోరారు. మహిళల హత్యలు, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులపై సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్నాయుడు, మంచినీళ్లపేట ప్రధానోపాధ్యాయులు మంగమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు ధనలక్ష్మి, జయమ్మ, లత, ఐసీపీఎస్ కోఆర్డినేటర్ సీతారాం, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.




# ఉద్దానం ఉద్యానవనాన్ని నాశనం చేయొద్దు

**మందస,నవంబర్ 26(వార్త):** ఉద్దానం భూములపై ప్రభుత్వాలు కన్ను వేశాయని రైతాంగ సమస్యల సాధన కమిటీ నాయకులు ఆరోపించారు. రాంపురం పంచాయతీ గంగువాడలో మామిడి మాధవరావు అధ్యక్షతన పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు విమానాశ్రయ భూసేకరణపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఉద్యానవనాన్ని నాశనం చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కొబ్బరి, జీడి మొక్కలపై ఆధారపడి జీవిస్తున్న రైతుల ఆస్తులపై ప్రభుత్వం కన్ను వేయడం చాలా దుర్దృష్టకరమన్నారు. కాలుష్య నివారణకు చెట్లు నాటండని పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చిన నాయకులు ఉన్న ఉద్యానవనాన్ని నాశనం చేయడం మానుకోవాలని కోరారు. రైతుల తరఫున పోరాడడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో సీహెచ్ గున్నయ్య, కొమర వాసు, పొట్టి ఎర్రయ్య, కీలు తవిటయ్య, గుంటు లోకనాథం, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, సింహాద్రి, నల్ల హడ్డి, కేహెచ్ఆర్ చౌదరి పాల్గొన్నారు.



# చేపల పెంపకంతో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి



**జలుమూరు, నవంబర్ 26(వార్త):** కొండకామేశ్వరిపేట గ్రామంలో మంగళవారం మత్స్యకారులకు ఫింగర్లింగ్ చేప పిల్లలను ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పంపిణీ చేశారు. ఆ గ్రామంలోని చెరువులోని గంగమ్మ తల్లికి పూజలు జరిపి, అందులోకి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ, 90 శాతం సబ్సిడీపై మత్స్యకార పనిముట్లు అందిస్తామని తెలిపారు. రాష్ట్రం మత్స్య సంపదలో మరింత వృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలను రూపొందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, మత్స్య శాఖ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, కూటమి నాయకులు, కార్యకర్తలు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

# అచ్చెన్నా..ఉచిత సలహాలు మానుకో?

-రెండో పంట వేయొద్దని రైతులకు చెప్పడం సరికాదు -వారి కన్నీరు తుడవలేని దుస్థితిలో ప్రభుత్వం

-పరిపాలన విడ్డూరం ఉంది -ఎన్నికల హామీలను అటకెక్కించేశారు - మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్ఎన్పేట, నవంబర్ 26(వార్త):** కూటమి ప్రభుత్వ పరిపాలన చాలా విడ్డూరంగా ఉందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. జగనన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అండగా ఉండి ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించారని తెలిపారు.

ఈ ప్రభుత్వం ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు రెండో పంట వేయొద్దని ఉచిత సలహాలు ఇవ్వడం తప్ప, వారికి ఉపయోగపడే ఒక్క ప్రయత్నం కూడా చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ఎద్దేవాచేశారు. కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారే తప్ప రైతులు, మహిళలు, విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఏ ఒక్క ప్రయత్నం కూడా చేయట్లేదని తెలిపారు. అధికార దాహం, రాజకీయ లబ్ధి, ఇసుక దోపిడీ, మద్యం వ్యాపారాలతో ఎమ్మెల్యేలు బిజీగా ఉన్నారే తప్ప ప్రజలకు మేలు చేసే పని ఒక్కటీ చేయట్లేదని దుయ్యబట్టారు. వీరిపై రైతులు, విద్యార్థులు, మహిళలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని జోస్యం చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మహిళను ఆదుకున్న 'యువభారత్'



ఇచ్ఛాపురం, నవంబర్ 26(వార్త): ఈదుపురం వేణుగోపాలస్వామి వీధికి చెందిన కొరికాన గున్నమ్మ కొద్దిరోజులుగా వెన్నుపూస సమస్యతో మంచానికే పరిమితమయ్యారు. ఈమె ఆపరేషన్ కోసం రూ.1.50 లక్షలవుతుందని వైద్యులు తెలిపారు. ఆమె తనకు వచ్చే పింఛన్‌తోనే బతుకుతోంది. ఈ విషయం తెలుసుకున్న తేలుకుంచి గ్రామానికి చెందిన యువ భారత సేవా సేవా ఫౌండేషన్ వారు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.



**నరసన్నపేట, నవంబర్ 26(వార్త):** రాజ్యాంగంతోనే అణగారిన వర్గాలకు చేయూత లభిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి నరసన్నపేటలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.



రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తిని కాపాడుకుందామని పోలాకి జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన నరసన్నపేట లక్ష్మీ టాకీస్ కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాపాడుకుంటూ గౌరవించుకుంటూ.. ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, జడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, కనుసు సీతారాం, కణితి కృష్ణారావు, సురంగి నర్సింగరావు, మొజ్జాడ శ్యామలరావు, బుక్క లక్ష్మణరావు, ధర్మాన జగన్, పోలాకి నరసింహమూర్తి, మండల పాగోటి గోవిందరావు, బుద్దల రాజశేఖర్, బురిల్లా శంకరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ రచించిన రాజ్యాంగ హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. మంగళవారం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ హక్కులను విద్యార్థులకు తెలిపారు. పారసెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞను ఉపాధ్యాయులు చేయించారు. రాజ్యాంగ దినోత్సవ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తవుడు, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





**పలాస, నవంబర్ 26(వార్త):** కాశీబుగ్గ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ పోరాటసమితి ఆధ్వర్యంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు పూలమాల నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చట్టసభల్లో అన్ని వర్గాల వారికి ఒకే రకమైన చట్టాలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాటసమితి నాయకులు పిలక కృష్ణారావు, తెప్ప పాపారావు, తుంగాన శంకరరావు, మట్ట జీవన్, పద్మలోచన, బీరప్పారావు, కాంగ్రెస్ నాయకులు తెంబూరి మధుసూదన్ రావు, నగిరి తారక, కోనపల్లి రవికుమార్, బోనెల రమణారావు, టీవీజీ గిరి, మట్ట రామకృష్ణ, ఎన్.నారాయణరావు, బోనెల కృష్ణారావు, రామారావు, ఎన్.సంజీవరావు, బి.ప్రవీణ్‌కుమార్, వై.దేవరాజు, రాజు చిన్నంచల, దళిత నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంతోనే బడుగులకు చేయూత

▪ వాడవాడలా భారత రాజ్యాంగ దినోత్సవం ▪ అంబేడ్కర్‌కు ఘన నివాళులు ▪ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నేతల పిలుపు

**మందస, నవంబర్ 26(వార్త):** చీపి పంచాయతీ బొంధికారి గ్రామంలో ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం దినోత్సవం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, ఆదివాసీ ముద్దుబిడ్డ కొమరం భీమ్ విగ్రహాలు ప్రతిష్టించడానికి గ్రామ పెద్దలు, ప్రజలు, యువత నిర్ణయించారు. కార్యక్రమంలో సవర కాలింజి, మేఘు, గోవర్ధన, లక్ష్మణరావు, చైతన్య, సత్యనారాయణ, దన్ను, కామేష్, రామదాసు, బాలకృష్ణ, హరికృష్ణ, మహిళలు, యువత పాల్గొన్నారు.

బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు అంబటి కృష్ణమూర్తి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు దీప్తి, కృష్ణారావు విద్యార్థులతో వివిధ వేషధారణలు వేయించారు. వివిధ ప్రాజెక్టులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**జలుమూరు, నవంబర్ 26(వార్త):** జలుమూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మెండ రామారావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఉంగటి అప్పలసూర్యనారాయణ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జల్లు రమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదో తరగతి విద్యార్థులు ప్రవీణ్, మధు చిత్రీకరించిన భారత మాత చిత్రాన్ని వారు ఆవిష్కరించారు. వీరికి బహుమతులు అందజేశారు భారత రాజ్యాంగం తయారీ, ప్రవేశిక గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బమ్మిడి శ్రీనివాసరావు, గార విశ్వనాథం, సీహెచ్ దమయంతికుమారి, డి.కాత్యాయనీ తదితరులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జలుమూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంఈవోలు మాధవరావు, రవిప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు ఇప్పిలి వేణుగోపాలరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని వాసంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





**వంగర, నవంబర్ 26(వార్త):** బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగ హక్కులను కల్పించడానికి డాక్టర్ అంబేద్కర్ కృషి చేశారని రాష్ట్ర ఉమెన్స్ కోపరేటివ్ కమిటీ చైర్మన్ కావలి గ్రీష్మ కొనియాడారు. మంగళవారం ఆమె వంగరలోని బాలి కల వసతిగృహంలో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ రచనలో అంబేద్కర్ కృషిని శ్లాఘించారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ కార్యాలయాల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో ఎల్.త్రినాథరావు, ఉపాధి హామీ, ఎంఈ వో కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం దిక్సూచి అంబేద్కర్ అని దళిత, బహుజన జేఏసీ నేతలు మజ్జి గణపతి, ఎం.గణపతిరావు ఉద్ఘాటించారు. మంగళవారం వారు వంగ రలో అంబేద్కర్ విగ్రహానికి పాలా భిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధ నకు అందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివేక్ మాస్టర్‌మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో దళిత, బహుజన జేఏసీ నాయకులు సింహాచలం, పారయ్య, సరోజని, జోజి, వెంకటరమణ, చిన్న, యువత అధిక సంఖ్యలో హాజరయ్యారు.



రాజ్యాంగ ప్రతిజ్ఞ అనుసరిస్తూ విద్యార్థులంతా భావిభారత నిర్మాణానికి పునాదులు వేయాలని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖండాపు జగదీశ్వరి సూచించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె ఆ పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సుందర శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దుతాం:ఎమ్మెల్యే గొండు



**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 26 (వార్త):** సుందర శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దడమే తమ ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పీఎన్ కాలనీలో రోడ్లు, కాలువ పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎన్ కాలనీలో తాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం కల్పించిన..

# హక్కులే పునాదులు

- ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను
- ఏఐమ్ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవం
- రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌కి నివాళి




**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 26 (వార్త):** అంబేద్కర్స్ ఇండియా మిషన్ (ఏఐమ్) ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం శ్రీకాకుళం నగరంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఏఐమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను, ఇతర ప్రతినిధులు, సైనికులు అంతా కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం కల్పించిన హక్కులే పునాదులన్నారు. అంబేద్కర్ కృషి కారణంగానే భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. అన్ని వర్గాలకి స్వేచ్ఛా, సమానత్వం కల్పించిందన్నారు. దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐమ్ నాయకులు సుంకు రమణ, దేబారికి రాజు, భూషణ్, పెయ్యల చంటి, అబ్బాస్, మహేష్, జాషువా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలకు స్ఫూర్తి.. భారత రాజ్యాంగం



**పోలాకి, నవంబర్ 26(వార్త):** ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తి అందని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాలను పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అధ్యక్షతన సంతబొమ్మాళి మండలం, బోరుబద్ర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లల్లో ప్రాథమిక హక్కులు, విధులు పట్ల అవగాహన కల్పించి రాజ్యాంగ విలువలు పెంపొందించాలని కోరారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె.తవిటిరెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులపై ఉందని అన్నారు.పాఠశాలలో వినూత్న బోధనా పద్ధతులకు సాంకేతికత జోడించి బోధించడమే కాక పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బాడాన రాజు, కె.తవిటి రెడ్డిలను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ సాంఘిక శాస్త్ర నమూనాలు, పటాలు ప్రదర్శన అందరికి విజ్ఞానం పంచింది . జి.సూర్య అనే విద్యార్థి తయారుచేసిన పోలవరం ఆనకట్ట వర్కింగ్ మోడల్ న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుని ప్రథమ బహుమతి పొందింది. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ టి.లోకేశ్వర రావు, ఉపాధ్యాయులు డి.ఉమా శంకర్, వెంకట రెడ్డి, కె.త్రినాథ రావు,డి.ఉమాదేవి,కె.రమణమ్మ, టి.విజయ లక్ష్మి, బి.నాగమణి, కె.తవిటి రెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు,పి.తిరుపతి రావు, శంకర రావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి, పాల్గొన్నారు

## మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయంలో..



**మెళియాపుట్టి, నవంబర్ 26 (వార్త):** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు

## ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం



**పలాస, నవంబర్ 26 (వార్త):** కాశీబుగ్గ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్‌సి వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రమానికి కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, చట్టసభలలో అన్ని వర్గాల వారికి ఒకే రకమైన చట్టాలు తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పిలక కృష్ణారావు, అధ్యక్షులు తెప్ప పాపారావు, కమిటీ సభ్యులు తుంగాన శంకరరావు, మట్ట జీవన్, పద్మలోచన, బీరప్పారావు, కాంగ్రెస్ నాయకులు తెంబూరి మధుసూదన్ రావు, సెక్రెటరీ నగిరి తారక, కోనపల్లి రవికుమార్, సీనియర్ నాయకులు బోనెల రమణారావు, పలాస రైల్వే ఎస్ సి, ఎస్ టి.యూనియన్ సెక్రెటరీ టీవీజీ గిరి, శ్రామిక యూనియన్ సెక్రటరీ మట్ట రామకృష్ణ, దళిత నాయకులు యన్ నారాయణ రావు, బోనెల కృష్ణారావు, రామారావు, ఎన్ సంజీవరావు, బి.ప్రవీణ్ కుమార్, వై దేవరాజు, రాజు చిన్నంచల, దళిత నాయకులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణతర్ల స్కూల్‌లో..

పలాస మండలంలోని బ్రాహ్మణ తర్లా ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా బాబు రాజేంద్ర ప్రసాద్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు రాజ్యాంగ పుస్తకం, 75 సంఖ్య ఆకారంలో మానవహారంగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త ఉపాధ్యాయుని ఎస్.జ్యోతమ్మని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అప్పన్న ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది.. మధుబాబు, రమేష్, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మలోచనం, జనార్ధన రావు, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, ఈశ్వరరావు, యామిని, మెహర్ సుధా, కిషోర్, రజని కుమారి, అరుణకుమారి, చిన్నా రావు, లక్ష్మి భాయి, విష్ణాచారి, రవితేజ, కోటేశ్వరరావు, తులసీరాణి పాల్గొన్నారు.



## సామాజిక మాధ్యమాల్లో వికృత చేష్టలను అడ్డుకోండి

**కాశీబుగ్గ, నవంబర్26 (వార్త):** గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు మండిపడ్డారు. కాశీబుగ్గ, డీఎస్పీతో పాటు స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు మంగళవారం తెలుగు దేశం పార్టీ నాయకులు ఫిర్యాదులు చేశారు. అనంతరం విఠల్‌రావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వికృత చేష్టలకు తెగబడిన ప్రతి ఒక్కరిని శిక్షించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కొత్త చట్టాన్ని రూపొందించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో వైసీపీ నాయకులు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని అరాచకానికి తెరలేపారని దుయ్యబట్టారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబాలపై కూడా అత్యంత పాశవికంగా పోస్టులు పెట్టారని గుర్తు చేశారు. రానున్న తరాలు ఈ విష సంస్కృతి వలలో చిక్కుకుపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు టీడీపీ నాయకులపై సోషల్ మీడియాలో అవాకులు చవాకులు మాట్లాడిన వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేశామన్నారు. ఆయన వెంట ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూ రావు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, లోడగల కామేశ్వరరావు, కోరికాన శంకర్, డొక్కరి శంకర్, మల్లా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అల్పపీడనంతో అప్రమత్తం

**ఇచ్ఛాపురం, నవంబర్ 26 (వార్త):** రాబోయే నాలుగు రోజుల్లో ఏర్పడనున్న అల్పపీడనం బలపడి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలియజేసిందని వ్యవసాయ అధికారిణి తాటిరెడ్డి భార్గవి చెప్పారు. రైతులు వరి పంట కోతలు ఈ నెల 30వ తేదీ తర్వాత చేయవలసినదిగా కోరారు. ఒకవేళ ఎవరైనా రైతులు వరి పంటకోసినట్లయితే వరి కంకులను కుప్పలుగా వేసి వాటిపైన టార్పాలిన్లను కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## జోనల్‌లో పలాస నెంబర్‌వన్‌గా ఉండాలి

- ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ సర్వాల్ బాను
- పలాసలో నూతన ఎల్ఐసి భవనం ప్రారంభం

**పలాస, నవంబర్ 26 (వార్త):** దేశంలో ఎనిదిది ఎల్ఐసీ జోనల్ కార్యాలయాలు ఉండగా సౌత్ సెంట్రల్ పరిధిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 16 డివిజన్ కేంద్రాల పరిధిలో సుమారు 300 పైగా ఎల్ఐసి బ్రాంచ్‌లు ఉన్నాయని, అందులో పలాస బ్రాంచ్ నెంబర్ వన్ గా ఉండేలా కృషి చేయాలని ముంబై ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ సర్వాల్ బాను అన్నారు. కాశీబుగ్గలో మంగళవారం ఎల్ఐసి నిధులు రూ.4 కోట్లు వ్యయంతో నిర్మించిన ఎల్ఐసి నూతన భవనం, క్వార్టర్స్ భవనాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం డివిజన్ పరిధిలో 20 బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. పలాసలో 1983 ఏడాదిలో బ్రాంచ్ ప్రారంబించి నేటికీ లాభాల బాటలో నడుస్తుందన్నారు. గత ఏడాది రూ. 32 కోట్లు వ్యాపారం జరగగా ఈ ఏడాది రూ.45 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పలాస బ్రాంచ్ మొదటి స్థానంలో ఉండేలా అధికారులు, ఏజెంట్లు పని చేయాలని కోరారు. ఎల్ఐసి ప్రజలకు ఒక భరోసాలా ఉంటుందన్నారు. ఎల్ఐసి పాలసీలపై ఎటువంటి అపోహలు పడనవసరం లేదన్నారు. ఎల్ఐసి బాండ్ లకు సక్రమంగా డబ్బులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ పునిత్ కుమార్, హైదరాబాద్ చీప్ ఇంజనీరింగ్ ఆర్ ఎల్ ఎన్ స్వామి, విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, విశాఖపట్నం మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్, పలాస బ్రాంచ్ మేనేజర్ టి బిసాయి, ఎల్ఐసి ఉద్యోగులు, ఏజెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ విప్ అశోక్‌ని కలిసిన మున్సిపల్ అధికారులు

**ఇచ్ఛాపురం, నవంబర్26(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు బెందాళం అశోక్ ప్రభుత్వ విప్ గా బాధ్యతలు స్వీకరించిన అనం తరం నియోజకవర్గానికి వచ్చారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేష్, మేనే జర్ అప్పల స్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్, ఏఈ సురేశ్,శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర మున్సిపల్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546